# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 007
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
డిసెంబర్ 08, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## డ్రాపవుట్‌లు తగ్గించాలి..

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించాలి
- పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

8లో..



# నేనే సర్పంచ్..!

## పల్లెల్లో ప్రచార హోరు

- అకర్షిస్తున్న పర్సనల్ మ్యానిఫెస్టో
- వినియోగంలో ఆధునిక సాంకేతికత
- డప్పు చప్పుళ్లతో మార్మోగుతున్న గ్రామాలు
- 11న తొలి విడత పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

గ్రామ పంచాయతీ ఎన్నికలు సార్వత్రిక పోరును తలపిస్తున్నాయి. సర్పంచ్ గా పోటీ చేస్తున్నఅభ్యర్థుల హామీలు చూస్తుంటే ఓటర్లకు దిమ్మతిరుగుతోంది. తమను గెలిపిస్తే ఊరికి ఏం చేయాలనుకుంటున్నారో బాండ్ పేపర్ల మీద రాసి ఇస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎలాంటి శిక్షలు వేసుకుంటారో ముందస్తుగానే హామీ పత్రంలో పేర్కొంటున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో ఆధునిక, సాంకేతికతను విరివిగా వినియోగించుకుంటున్నారు. వాట్సాప్, యూట్యూబ్ వేదికగా ప్రచారం చేస్తున్నారు. ట్రెండింగ్ లో ఉన్న పాటలు, వ్యాఖ్యానాలు జోడిస్తూ పోస్ట్ లు పెడుతున్నారు. దీనితోపాటు ఇంటింటి ప్రచారాలు, డప్పు చప్పుళ్లతో గ్రామాలు మార్మోగుతున్నాయి. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలకు ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయగా 395 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు గ్రామాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండో విడతలో 4,332 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ జారీ చేయగా 415 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. మూడో విడత నామినేషన్ల ఉపసంహరణకు 9వ తేదీ వరకు అవకాశం ఉంది. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం చేస్తుండగా అధికారులు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాటు పూర్తి చేశారు.

- వరంగల్ వాయిస్, డోర్నకల్

వివరాలు2లో..



2లో..

## పెరిక కులాభివృద్ధికి కృషి

- రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్

## అవినీతి రహిత సమాజమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




2లో..




8లో..

## డ్రైన్‌ల తర్వాతే రహదారి నిర్మాణాలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష

# నేనే సర్పంచ్..!

- పల్లెల్లో ప్రచార హోరు
- ఆకర్షిస్తున్న పర్సనల్ మ్యానిఫెస్టో
- వినియోగంలో ఆధునిక సాంకేతికత
- డప్పు చప్పుళ్లతో మార్మోగుతున్న గ్రామాలు
- 11న తొలి విడత పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పంచాయతీ పోరుకు సమయం సమీపిస్తుండడంతో పల్లెల్లో ప్రచారం హోరెత్తుతోంది. బరిలో నిలిచిన అభ్యర్థులు తమకు ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తూనే ప్రత్యర్థుల ఎత్తుకు పైఎత్తుల వేయడంపై దృష్టి సారించారు. అయితే ఉదయం నుంచి రాత్రి వరకు సాగుతున్న ప్రచార తీరు గతంకు భిన్నంగా ఉంటుంది. ఆధునిక సాంకేతికతను అభ్యర్థులు విరివిగా వాడుతున్నారు. వాట్సాప్, యూట్యూబ్ వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఇందు కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. అనుభవగ్యులైన వారిని నియమించుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న కొంతమంది ముఖ్యులతో గ్రూపులు ఏర్పాటు చేయించి వాటిలో ఓటర్లను చేర్పించారు.

## ట్రెండింగ్ పాటలతో..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు ట్రెండింగ్ లో ఉన్న పాటలను విరివిగా ఉపయోగిస్తున్నారు. ట్రెండింగ్ లో ఉన్న పాటలు, వ్యాఖ్యానాలు తదితర అంశాలను జోడిస్తూ ప్రచారం పోస్టులు పెడుతున్నారు. ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ వారికి భిన్నంగా పోస్టులు పెడుతూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఓవైపు మైకులు, డబ్బు చప్పుళ్ల గ్రామాల్లో మార్మోగుతుండగా మరోవైపు సామాజిక మాధ్యమాల్లోనూ ఓట్లు అభ్యర్థన తారా స్థాయికి చేరుకుంది. ఎన్నికల కోసం సర్పంచ్ అభ్యర్థులు తమ పేర్లతో బాని కట్టించిన పాటలు, సందేశాలు, హామీలను వివరిస్తూ పాటలతో కూడిన వీడియోలు, డిజిటల్ కార్డులు తయారు చేసి వాటిని సామాజిక మాధ్యమాలో పోస్ట్ చేస్తూ ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ అభిమాన నేత ఫొటోలను కలిపి ప్యాన్స్ తో ప్రచారం చేస్తున్నారు.

## మూడు విడతల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11న మొదటి విడత ఎన్నికలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే ప్రచారంలో మాత్రం ఏమాత్రం తగ్గకుండా తమ ఊపును కొనసాగిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలు ప్రత్యక్షంగా పోటీ పడకపోయినప్పటికీ ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లుగా తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్ని మండలాల్లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది.

## 810 ఏకగ్రీవం..

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా మూడో విడత నామినేషన్ల ఉపసంహరణకు రేపటితో గడువు ముగియనుంది. తొలి, రెండో విడత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 810 మంది సర్పంచ్ లు, 17,635 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4,236 గ్రామాలకు నోటిఫికేషన్ జారీ చేయగా 22,330 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అయితే వీటిలో 395 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఈ నెల 11 వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. సాయంత్రం తుది ఫలితాల వెల్లడితోపాటు ఉప సర్పంచ్ ఎన్నికను సైతం అదే రోజు పూర్తి చేయనున్నారు. ఈ నెల 14న రెండో విడత ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో 4,332 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ జారీ చేయగా 415 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.

## సునీతా .. సంథింగ్ స్పెషల్..

డోర్నకల్ మండలంలో మూడో విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. సర్పంచ్ అభ్యర్థులు వారికి మద్దతు తెలుపుతున్న పార్టీల నాయకుల వీడియోలు, సందేశాలు, హామీలను వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. మండలంలోని హున్యా తండా సర్పంచ్ అభ్యర్థి భూక్య సునితా కాశీరం 'మార్పు కోసం ఒక అడుగు' అంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో మాదిరిగానే తాను ప్రత్యేక మ్యానిఫెస్టో రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. తనను గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. హున్యా తండా గ్రామపంచాయతీలోని ఐదు దేవాలయాలకు ప్రతి నెల ధూప, దీప, నైవేద్యానికి రూ.1,016, గ్రామంలో వివాహం జరిగే ఆడబిడ్డకు పెళ్లికానుకగా రూ.5,016, కుటుంబంలో పుట్టిన ఆడపిల్లకు రూ.2,516 బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేయడం, ప్రతి రోజు ఒక్కో కుటుంబానికి 20 లీటర్ల మినరల్ వాటర్, హున్యాతండా గోద దండ, రాము తండా, బోడో హట్యా తండాలలో ఉన్న విద్యార్థులకు సాయంత్రం ట్యూషన్, ప్రతి సంవత్సరం ఓసారి ఉచిత మెగా వైద్య శిబిరం, కుటుంబంలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 వేల ఆర్థిక సహాయం, గ్రామంలో విశ్రాంతిగా కూర్చునేందుకు సిమెంట్ బల్లాల ఏర్పాటు లాంటి సొంత మ్యానిఫెస్టోతో ప్రచారం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టే పనుల గురించి ప్రత్యేకంగా విడియోలు తయారు చేయించి ప్రచారం చేస్తున్నారు.. సునితా కాశీరాం నాయక్.






## పెరిక కులాభివృద్ధికి కృషి

□ రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** పెరిక కులాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలంగాణ పెరిక కుల సంఘం (766/2014) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గటిక విజయ్‌కుమార్ అన్నారు. వరంగల్‌లోని ఎమ్‌కే నాయుడు కన్వన్షన్ హాల్లో ఆదివారం జరిగిన పెరిక కుల వెబ్‌సైట్ ప్రారంభం, సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కోకాపేటలో రెండు ఎకరాల స్థలంలో తెలంగాణ పెరిక కుల ఆత్మగౌరవ భవనం నిర్మాణం అవుతుందన్నారు. రాష్ట్రంలో మరే కుల సంఘం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవనం నిర్మించుకోలేదని, ఆ ఘనత పెరిక కుల సంఘానికి దక్కుతున్నదని చెప్పారు. ఎల్బీనగర్ ప్రాంతంలో బాలికల కోసం ప్రత్యేక వసతిగృహం నిర్మిస్తున్నామని, పెరిక కుల పరపతి సంఘం ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రూపాయల టర్నోవర్ తో ఆర్థిక సహాయ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. పెరిక సంక్షేమ సమితి ద్వారా కోటి రూపాయల నిధితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 35 అనుబంధ సంఘాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి పెరిక బిడ్డ ఆలనా, పాలనా చూసే ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. ఈ సమావేశంలో పెరిక కుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మద్దాలింగయ్య, మాజీ అధ్యక్షు శ్రీరామ్ దయానంద్, చింతం సదానందం, అల్లం నాగరాజు, బరుపాటి గోపి, బెడిద వీరన్న, నలివెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేశ్ వర్మ

పెరిక కుల వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేశ్ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటించారు. రాష్ట్ర, జిల్లా పెరిక కుల నాయకులు, పెరిక కులస్థులు అల్లం రాజేశ్ వర్మను ఘనంగా సన్మానించారు.



## మాజీలంతా ఒకే వేదికపై..

□ ఘనంగా వరదారెడ్డి 80వ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, మడికొండ :** ఎస్సార్ యూనివర్సిటీ సీఈవో, ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి 80 వ జన్మదిన వేడుకలు మడికొండలోని రెడ్డి పంక్షన్ హాల్ లో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. బిన్నమైన పార్టీలకు చెందిన రాజకీయ మహారథులు ఒకే వేదికపై దర్శనమిచ్చారు. మాజీ మేయర్ తక్కెళ్ళపల్లి రాజేశ్వర్ రావు (బీజేపీ), వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ న్యాయవాది వన్నాల శ్రీరాములు (బీజేపీ), హనుమకొండ లోక్ సభ మాజీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది బోయినపల్లి వినోద్ కుమార్ (బీఆర్ఎస్), వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ నన్నపునేని నరేందర్ (బీఆర్ఎస్), వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ (బీజేపీ), హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు (బీజేపీ) ఒకే వేదికపై కనిపించి అందరినీ సంభ్రమార్చర్యాలకు గురిచేశారు. వీరితోపాటు ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ తిరుమల రావు, ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి (బీజేపీ), బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ, బీజేపీ జిల్లా నాయకులు మల్లాడి తిరుపతి రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సదానందం తదితరులు వరదారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీలంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

# అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

## ◆ మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి పిలుపు



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి మొగుళ్లపల్లి మండలం, ఇసిపేట గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కొడారి రమేష్ గెలుపు దిశగా దూసుకుపోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కొడారి రమేష్‌కు పట్టం కట్టడానికి గ్రామ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ నాయకులందరూ ఐకమత్యంతో, కలిసికట్టుగా రమేష్ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాత నాయకులు, కొత్త నాయకులు అనే తేడా లేకుండా అందరూ ఒకే తాటిపై నడవాలని సూచించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని గండ్ర రమణారెడ్డి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థికి ఓట్లేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డితో పాటు మాజీ ఎంపీటీసీ పిన్నింటి వెంకట్రావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నినాదాలతో ఇసిపేట గ్రామం హోరెత్తిపోయింది.

# గణపురం అభివృద్ధికి పాటుబడుతా

## సర్పంచ్ అభ్యర్థి కటుకూరి రాధిక శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం గ్రామం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రతి కుటుంబం ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కటుకూరి రాధిక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధినే తన ఏకైక ఎజెండాగా తీసుకుని తాను ఈ ఎన్నికల బరిలో నిలిచానని ఆమె స్పష్టం చేశారు. యువతకు అవకాశాలు, మహిళలకు భద్రత, రైతులకు సాయం, వృద్ధులకు ఆదరణ... ప్రతి వర్గానికి చేయూత అందించేది కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో కాంగ్రెస్ పార్టీ అందించే పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. గణపురం అభివృద్ధి కోసం వస్తున్న తనను ఆశీర్వదించి, 'బ్యాట్' గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి కటుకూరి రాధిక శ్రీనివాస్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అలియాబాద్ అభివృద్ధికి కృషిచేస్తా

## సర్పంచ్ అభ్యర్థి సనత్ పటేల్



**వరంగల్ వాయిస్, పరకాల:** మండలంలోని అలియాబాద్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సనత్ పటేల్ గ్రామాభివృద్ధినే తన ఏకైక లక్ష్యంగా ప్రకటించారు. ప్రజలు తమ అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని, ఈ ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఆయన గ్రామ ఓటర్లను, బంధుమిత్రులను విజ్ఞప్తి చేశారు. వార్డు సమస్యల పరిష్కారమే తన ప్రథమ ధ్యేయమని సనత్ స్పష్టం చేశారు. "అవినీతికి, బేధభావాలకు తన పాలనలో తావు ఉండదు. గ్రామ ప్రజల కోసం ప్రతి క్షణం పనిచేసేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అని ఆయన పేర్కొన్నారు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు సనత్ పటేల్ ఈ కింది ముఖ్యమైన హామీలను ప్రజల ముందుంచారు. గ్రామమంతటా కొత్త డ్రైనేజీ లైన్ల నిర్మాణం చేపడతాను. అన్ని వీధుల్లో వీధి దీపాల ఏర్పాటు, పాతవాటికి తక్షణమే మరమ్మతులు. కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తగిన చర్యలు. అర్హులైన వారికి పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తాను. ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా పర్యవేక్షిస్తాను. గ్రామంలో కొత్త సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాను. ప్రతి వీధిలో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తాను. మహిళా సంఘాలు, గ్రామ చిన్నపాటి కార్యక్రమాలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తాను. "నేను మాట ఇచ్చిన వాడిని... మాట నిలబెట్టుకునేవాడిని. మీ నమ్మకానికి తగిన విధంగా, చిత్తశుద్ధితో పని చేస్తాను" అని సనత్ పటేల్ హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికోసం ప్రజల నమ్మకమే తన శక్తి అని, ఆశయాల సాకారమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అలియాబాద్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సనత్ పటేల్, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజల మద్దతు కోరుతూ 'కత్తెర' గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ తన ప్రచారాన్ని ఉధృతం చేశారు.

# కోటగుళ్లలో సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాజు ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద, కాకతీయుల కళాక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ల)లో ఆదివారం ఆరుద్ర నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.నాగరాజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఆయనను సాదరంగా ఆహ్వానించి, స్వామివారికి అభిషేకం, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.నాగరాజును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గణపురం ఎస్ఐ రేఖ అశోక్ కూడా ఉన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



వరంగల్ వాయిస్, కాశిబుగ్గ : బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ చైర్మన్ ప్రదీప్ రావు చేతుల మీదుగా "రమేష్ లండన్ సెలూన్" క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఓ సిటీ రోడ్డులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సెలూన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, భారతీయ జనతా పార్టీ నాయకుల సమక్షంలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సెలూన్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి సతీష్, మొగిలిచర్ల సతీష్ కుమార్, బీజేపీ నేతలు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, మార్టిన్ లూథర్, చింతం రాజు, కోమాకుల నాగరాజు, కందుకూరి శ్రీను, శ్రీకాంత్, రాఘవ తదితరులు పాల్గొన్నారు. అలాగే సెలూన్ యజమానుల తరపున వేణు (జిల్లా ఉపాధ్యక్షులు), సాంబమూర్తి, మేడిపెల్లి దశరథం (గౌరవ అధ్యక్షులు) కూడా పాల్గొన్నారు.

# 'సైబర్ సారథి @ 1930'పై విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు అవగాహన కల్పించి, నేరాలను నియంత్రించాలనే ఉద్దేశంతో వరంగల్ కమిషనరేట్ "సైబర్ సారథి @ 1930, ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం శాయంపేట మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పరకాల ఏసీపీ సీ.సతీష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల గురించి వివరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లు లేదా మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే, వారికి మీ వ్యక్తిగత సమాచారం లేదా ఓటీపీని షేర్ చేయవద్దని పిల్లలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఏసీపీ పిల్లలకు సూచించారు.సీఐ గోపి (సీసీఎస్), శాయంపేట సీఐ పి.రంజిత్ రావ్, ఎస్సై జె.పరమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**వరంగల్ వాయిస్,హనుమకొండ :** బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఇంచార్జిగా నూతనంగా నియమితులైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ కు సోమవారం ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు సహా రాష్ట్ర, జిల్లా పదాధికారులతో కలిసి పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వేద బ్యాంక్ వైట్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో ప్రతీ కార్యకర్త గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ చురుకుగా పనిచేయాలి. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, గుజ్జు సత్యనారాయణ రావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ గట్టి కొప్పుల రాంబాబు, మాజీ జిల్లా అధ్యక్షులు దొంతి దేవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్‌తో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించండి

## ■ ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై తక్షణమే దృష్టి సారించి, వాటికి నూతన భవనాలను నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శివనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఖిలా వరంగల్ మండల ముఖ్య సమావేశం శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ సమస్యల నిలయంగా హాస్టళ్లు జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు అనేక సమస్యలకు నిలయంగా మారాయని శరత్ ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం సరిగా లేవని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆయన విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ బిల్లులను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వరంగల్ జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలతోపాటు, ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేసి, విద్యార్థులను ఆదుకోవాలని శరత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి వెంట మాజీ ఎంపీటీసీ పిన్నింటి వెంకట్రావు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, గ్రామస్తులు బీఆర్ఎస్ నినాదాలతో ఇస్ పేట గ్రామాన్ని మారుమోగించారు.

# కేయూలో నోబెల్ ప్రైజ్ వేడుకలు


**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం (కే.యూ) స్టూడెంట్ అఫైర్స్ డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీలలో రెండు రోజులపాటు "నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్" నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ అఫైర్స్ డీన్, ఆచార్య మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా, మొదటి రోజు ఈనెల 9న ఉదయం 10:00 గంటల నుంచి 11:30 నిమిషాల మధ్య వివిధ విభాగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. కెమిస్ట్రీ"నోబెల్ కెమిస్ట్రీ డిస్కవరీస్ లో ట్రాన్స్‌ఫార్మింగ్ సైన్స్ అండ్ సొసైటీ"పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, జువాలజీ, ఫార్మసీ"నోబెల్ డిస్కవరీస్ ఇన్ హ్యూమన్ హెల్త్"పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు, ఫిజిక్స్"హౌ నోబెల్ ప్రైజ్ డిస్కవరీస్ ఇన్ ఫిజిక్స్ షేప్ అవర్ మోడరన్ వరల్డ్"పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలుఎకనామిక్స్"హౌ నోబెల్ ప్రైజ్ డిస్కవరీస్ ఇన్ ఎకనామిక్స్ ట్రాన్స్‌ఫార్మ్ సొసైటీస్" పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు, ఇంగ్లీష్"నోబెల్ లారేట్స్ ఇన్ లిటరేచర్: వాయిసెస్ దట్ చేంజ్డ్ ది వరల్డ్"పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు.ఈ రెండు రోజుల వేడుకల్లో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని, నోబెల్ బహుమతి ఆవిష్కరణల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి కోరారు.

# సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్‌కు కేయూ జట్టు ఎంపిక



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ (మహిళల) టోర్నమెంట్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం తరపున టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎం.శ్వేతా – విశ్వవిద్యాలయ వ్యాయమ కళాశాల, పి.వర్షిత – కొత్తగూడెం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, ఎం.వర్షిత – వరంగల్ కిట్స్ కాలేజీ, పి.శ్రావణి – వరంగల్ కిట్స్ కాలేజీ, ఎం.నందిని – వరంగల్ ఈస్ట్ టీ.జీ.ఎస్.డబ్ల్యూ.ఆర్.డీ.సీ (డబ్ల్యూ)లు ఎంపికయ్యారు. ఈ జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా జనగాం ఏబీవీ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ టి.కళ్యాణి వ్యవహరిస్తారని ఆచార్య వెంకయ్య తెలిపారు. టోర్నమెంట్‌లో కేయూ జట్టు ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

# బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికల పర్వం జోరుగా కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో సోమవారం పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. సోమవారం పెంచికలపేట గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మందపల్లి మరియా, మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి ప్రసాద్, అలాగే ఇందిరమ్మ కమిటీ సభ్యులు మందపల్లి సుధాకర్, మందపల్లి వినోద్ మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదే విధంగా, మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన సమ్మక్క సారలమ్మ జాతర డైరెక్టర్ ఎరుకల చంద్రపాల్, ఎరుకల శ్రీను, ఇమ్మడి పవన్, మాజీ సర్పంచ్ కడదుల సాంబయ్య, కాంగ్రెస్ యూత్ నాయకులు జలగం రాజు, సానబోయిన సురేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. చావల్లపెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొమ్మగాని భాగ్య రవి కూడా కాంగ్రెస్ నుంచి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# కేంద్రం తెచ్చిన విత్తన, విద్యుత్ బిల్లులు వెనక్కి తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తనాల బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు 2025లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. ఎస్‌కేఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు, సోమవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో రైతు సంఘాల నాయకులు బిల్లు ప్రతులను దగ్ధం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ, చిన్న రైతులకు నష్టం కలిగించి, భారతదేశ విత్తన సార్వభౌమత్వాన్ని కొన్ని దేశీయ, బహుళజాతి గుత్తాధిపతులకు అప్పగించే పెద్ద రాజకీయ ప్రణాళికలో విత్తన బిల్లు భాగమని ఆరోపించారు. "రైతుల హక్కులను, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించడం ద్వారా గుత్తాధిపతులు విత్తనాలను దోపిడీ చేసే ధరలను సులభతరం చేయడానికి ఈ బిల్లులోని నిబంధనలు దోహదపడతాయి. విత్తనాల బిల్లు 2025 ముసాయిదా, పీపీవీఎఫ్ఆర్ (మొక్క రకాలు, రైతుల హక్కుల రక్షణ) చట్టం–2001, అంతర్జాతీయ నిబద్ధతలకు విరుద్ధంగా ఉంది. ఇది విత్తన రంగంలో సమతుల్యతను పూర్తిగా పెద్ద కార్పొరేట్‌లకు అనుకూలంగా మారుస్తుంది" అని వారు వివరించారు. ముసాయిదా విద్యుత్ బిల్లు–2025 భారత విద్యుత్ వ్యవస్థను పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ, కేంద్రీకరణ కోసం రూపొందించబడిందని వారు ఆరోపించారు. ఈ బిల్లు అమలైతే, విద్యుత్ పంపిణీ, ఉత్పత్తిలో అత్యంత లాభదాయక విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారని, ప్రభుత్వ రంగం మాత్రం నష్టాలను, సామాజిక బాధ్యతలను భరించవలసి వస్తుందని అన్నారు. క్రాస్–సబ్సిడీలను తొలగించడం వల్ల పేద, గ్రామీణ కుటుంబాలకు విద్యుత్ సుంకాలు విపరీతంగా పెరిగి, రైతులను మరింత కష్టాల్లోకి నెట్టివేస్తుందని హెచ్చరించారు. కార్పొరేట్ ప్రయోజనాలతో నడిచే ఈ చర్య ప్రజలకు, రైతులకు, కార్మికులకు వ్యతిరేకమని వారు స్పష్టం చేశారు.ముసాయిదా విద్యుత్ బిల్లును రద్దు చేసే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎస్‌కేఎం నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్‌లు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, భాస్కర్, వల్లందాస్ కుమార్, ఐత నగేష్, మొగిలయ్య, మైదం పాణి, ఎండీ అక్బర్ పాల్గొన్నారు.

# చెరువులో గల్లంతైన విద్యార్థి మృతదేహం వెలికితీత



- రెండు రోజులు శ్రమించిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం
- అధునాతన పద్ధతులతో గాలింపు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** జిల్లాలోని అనంతారం గ్రామంలోని పోచమ్మ చెరువులో గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థి భూక్య సాయి కిరణ్ మృతదేహాన్ని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందం ఈరోజు (సోమవారం) వెలికి తీసింది. శనివారం పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి కిరణ్ తన స్నేహితులతో కలిసి అనంతారం గ్రామంలోని మైసమ్మ చెరువులో ఈత కొడుతూ నీటిలో గల్లంతయ్యాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే, తెలంగాణ ప్రత్యేక పోలీస్ మామునూర్ నాలుగో బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్ఎఫ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ) రవి నేతృత్వంలోని 25 మంది సభ్యుల బృందం వెంటనే ఘటన స్థలానికి బయలుదేరి, శనివారం రాత్రికి అక్కడికి చేరుకుంది. శనివారం రాత్రి నుంచి ఆది, సోమవారం రెండు రోజులపాటు ఈ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అండర్ వాటర్ సెర్చ్ మరియు జీరో కట్ మెథడ్ వంటి అధునాతన టెక్నిక్‌లను ఉపయోగించారు. సోమవారం మధ్యాహ్నం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన తర్వాత చెరువులో గల్లంతైన మృతదేహాన్ని విజయవంతంగా గుర్తించి, బయటికి తీశారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం చూపించిన నైపుణ్యం, శ్రమను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అభినందించారు. అలాగే, నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, ఎస్‌డీఆర్ఎఫ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, ఇతర ఉన్నతాధికారులు ఎస్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యుల పనితీరును ప్రశంసించారు.

# బీసీల రాజ్యాధికారానికి కవితను గెలిపించండి

- బీసీ హక్కుల సాధన సమితి పిలుపు



**వరంగల్ వాయిస్, మొగుల్లపల్లి:** మండలంలోని పిడిసిల్ల గ్రామ సర్పంచ్‌గా సీపీఐ బలపరిచిన తాటిపాముల కవిత శ్రీహరిని గెలిపించి, బీసీల సత్తాను చాటాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. పిడిసిల్లలో జరిగిన ప్రచార సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు మాట్లాడుతూ... గత, ప్రస్తుత పాలకుల విధానాల వల్ల 56% ఉన్న బీసీలకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. "బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిపి 85 శాతం ఉన్నా, రాజ్యాధికారం మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. 10 శాతం కూడా లేని ఆధిపత్య కులాలు అధికారాన్ని చెలాయిస్తూ ప్రజలపై పెత్తనం చేస్తున్నారు" అని వెంకట్రాములు విమర్శించారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మించి, కేవలం 17 శాతం కూడా ఇవ్వకుండా అగ్రవర్ణాలకే పెద్ద పీట వేయడం దారుణమని, బీసీలకు ద్రోహం చేసిన పార్టీలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, నిస్వార్థంగా ప్రజాసేవకే అంకితమైన తాటిపాముల కవితను 'ఉంగరం' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోవాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి కవిత మాట్లాడుతూ, సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి, ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకొని నిజమైన సేవకురాలిగా పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సీపీఐ నాయకులు ప్రవీణ్ కుమార్, రాజయ్య, ఎండీ నబీ, నిమ్మల రాజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉంది

◆ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం
◆ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** "ఈ ఎన్నికలు కేవలం గ్రామ అభివృద్ధికి సంబంధించినవి. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం. కాబట్టి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి" అని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు పిలుపునిచ్చారు. ఐనవోలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బోల్లపల్లి మధు, వార్డు అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. "రాష్ట్రంలో మరో మూడేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహకారంతో మన గ్రామాన్ని, మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందాం" అని రవీందర్ రావు హామీ ఇచ్చారు. ఇతర పార్టీ అభ్యర్థులు గెలిస్తే, వారు ప్రభుత్వం దగ్గరకు, ఎమ్మెల్యే దగ్గరకు రాలేరని, దాంతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల, గ్రామ ప్రజలు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని కోరారు. "పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం ద్వారా మన గ్రామ అభివృద్ధిని మన చేతుల్లోనే ఉంచుకోవాలి" అని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు గ్రామ సర్పంచ్ అభ్యర్థి, వార్డు అభ్యర్థులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నివారణపై అవగాహన పెంచాలి

## సెంట్రల్ జోన్ డీసీపీ కవిత




**వరంగల్ వాయిస్,హనుమకొండ:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత సోమవారం సుబేదారి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె స్టేషన్ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ పద్ధతి, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా, స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదులపై స్పందించే వేగం, మహిళలు పిల్లల ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను డీసీపీ వివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ కవిత మాట్లాడుతూ... ప్రజల్లో నేరాల నివారణపై అవగాహన పెంచే దిశగా పోలీస్ సిబ్బంది మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లు వంటి నేరాలపై గ్రామ స్థాయి వరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తరించాలని ఆమె ఆదేశించారు. యువతలో డ్రగ్స్ పెరుగుతున్న ప్రమాదం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, విద్యాసంస్థలు, కాలేజీలు, పబ్లిక్ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, సీఐ రంజిత్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

## ట్రాఫిక్ ఏడీసీపీ ప్రభాకర్ రావు



**వరంగల్ వాయిస్, క్రైం :** ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు స్పష్టం చేశారు. ట్రై-సిటీ పరిధిలో నిన్న నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు సోమవారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో ఏడీసీపీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరం. మీ కుటుంబ యోగక్షేమాలను దృష్టిలో పెట్టుకొని ఈ అలవాటును మానుకోవాలి. మద్యం తాగి వాహనం నడపడం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు అప్పగించవద్దు. అలా చేస్తే వాహన యజమానిపై చట్టపరమైన కేసు నమోదు చేయబడుతుంది. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. అలాగే లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలి. ముఖ్యంగా, వాహనంపై ప్రయాణించే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడవద్దని అదనపు డీసీపీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దీని ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలి

• ఏసీపీ సతీష్ బాబు




**వరంగల్ వాయిస్,ఆత్మకూరు:** ఆధునిక సాంకేతిక యుగంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో, ఆత్మకూరు మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాలలో సోమవారం సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పరకాల ఏసీపీ సతీష్ బాబు, సైబర్ క్రైమ్ నోడల్ ఆఫీసర్, ఏసీపీ సదయ్య ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీలు మాట్లాడుతూ... సైబర్ క్రైమ్ అంటే కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ పరికరాలను ఉపయోగించి చేసే చట్టవిరుద్ధమైన కార్యకలాపాలని వివరించారు. ముఖ్యంగా హ్యాకింగ్, ఫిషింగ్, మాల్వేర్ దాడులు, గుర్తింపు దొంగతనం వంటి వాటికి పాల్పడుతూ, వ్యక్తులు మరియు సంస్థల ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. సున్నితమైన డేటాను దొంగిలించడం ద్వారా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగిస్తున్నారని వారు హెచ్చరించారు. డిజిటల్ మ్యాట్రిమోని సైట్లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలకు పాల్పడుతూ ప్రజలను, ప్రభుత్వాలను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ముఖ్యంగా ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆన్‌లైన్‌లో ఎవ్వరిని నమ్మకూడదు. తమ వ్యక్తిగత సమాచారం, ఆర్థిక సమాచారం ఎప్పుడూ గోప్యంగా ఉంచుకోవాలి" అని వారు సూచించారు. ఇలాంటి సైబర్ మోసాలు తమ దృష్టికి వచ్చిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కమిషనరేట్ ఇన్స్పెక్టర్ గోపి, శాయంపేట సీఐ రంజిత్, దామెర ఎస్సై అశోక్, పోలీసు బృందం, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడుప చంద్రమౌళికి ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** మండలంలోని అనంతసాగర్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ అడుప చంద్రమౌళిని తోటి ఉద్యోగ మిత్రులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ అడుప చంద్రమౌళి, ప్రొఫెసర్ శివ చిదంబరనాథన్ పర్యవేక్షణలో, చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా అందుకున్నారు. ఆయన సమర్పించిన పరిశోధన పత్రం అంశం: "Enhanced Tracking of the Maximum Power from Renewable Energy Frame-works" (పునరుత్పాదక ఇంధన వ్యవస్థల నుంచి గరిష్ట శక్తిని మెరుగ్గా ట్రాక్ చేయడం). ఈ సందర్భంగా, ఉద్యోగ మిత్రులు డాక్టర్ చంద్రమౌళి కృషిని, పట్టుదలను ప్రశంసించారు. ఆయన తమలాంటి ఎంతోమందికి ప్రేరణగా నిలిచారని తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన టెక్నికల్ మరియు నాన్-టీచింగ్ ఉద్యోగస్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నక్కలగుట్టలోని శ్రీ చైతన్య హనుమకొండ-1 పాఠశాల విద్యార్థులకు సోమవారం నాసాకు సంబంధించిన కిట్స్, బహుమతులు అందజేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ మంజుల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శాస్త్ర విజ్ఞానంలో ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. "మన భారతదేశం శాస్త్ర రంగంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. విద్యార్థులు కూడా చిన్నప్పటినుండే సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తిని పెంచుకొని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి" అని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు నాసా కిట్స్‌ను, బహుమతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, జోనల్ అకాడమీ కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సరిత, డీన్ సుప్రియ, నాసా ఇంచార్జి దత్త వాసుతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయూ నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ ఆదేశాల మేరకు, బీసీ మహాసేన నాయకులు సోమవారం కాకతీయ యూనివర్సిటీ (కేయూ) రిజిస్ట్రార్ వి.రామచంద్రంని కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనివర్సిటీలో రాబోయే నియామకాలు, ప్రమోషన్లలో బీసీలకు మెరుగైన అవకాశాలు కల్పించాలని బీసీ మహాసేన నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న నియామకాలన్నింటిలో బీసీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రమోషన్లు, నియామకాల్లో రోటరీ పద్ధతిని అనుసరించి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో బీసీలకు అవకాశాలు కల్పించాలి. మెజారిటీ వర్గమైనా బీసీలు అవకాశాల్లో మైనారిటీలుగా మిగులుతున్న సందర్భంలో, భవిష్యత్తులో జరగబోయే ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లలో బీసీలకు న్యాయం చేయాలి. ఈ వినతిపై స్పందించిన కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను తప్పకుండా వైస్ ఛాన్సలర్ గారి దృష్టికి తీసుకెళ్లి, బీసీ ఉద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్ సానుకూల స్పందన పట్ల తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర నాయకులు నలుబాల రవికుమార్, పి.వెంకట చారి, జూకంటి రవీందర్, అనిశెట్టి సాయి తేజ పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** ఈ నెల 11, 17వ తేదీల్లో జరిగే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, తద్వారా గ్రామ అభివృద్ధికి పట్టం కట్టాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పిలుపునిచ్చారు. సోమవారం కమలాపూర్ మండల పరిధిలోని మర్రిపల్లి, మర్రిపల్లిగూడెం, వంగపల్లి, ఉప్పలపల్లి, అంబాల గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ప్రణవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మరో మూడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. “కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే, గ్రామాల్లో తలెత్తిన సమస్యలు మా దృష్టికి నేరుగా వచ్చి, తక్షణమే పరిష్కరించే అవకాశం ఉంటుంది. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత నేను తీసుకుంటాను” అని ఆయన హామీ ఇచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు హుజురాబాద్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నాయని ప్రణవ్ విమర్శించారు. సెంటిమెంట్ డైలాగులు, ‘చస్తా’ అని బ్లాక్‌మెయిల్ చేయడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం తప్ప హుజురాబాద్‌కు చేసింది ఏమీ లేదన్నారు. ప్రణవ్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పనితీరును ప్రశ్నించారు. “గత రెండు సంవత్సరాలుగా హుజురాబాద్ ప్రజల గురించి పట్టించుకున్న నాథుడు లేడు. ఎన్నికల సమయం రాగానే ఓట్ల కోసం ఇటువైపు వస్తున్నారు. ఎమ్మెల్యే అయిన నాటి నుంచి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ గడ్డకు రూపాయి నిధులైనా తీసుకొచ్చారా?” అని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి తన వింత ప్రవర్తన వల్ల హుజురాబాద్ నియోజకవర్గ పరువు తీస్తున్నారని, గతంలో ఎమ్మెల్సీగా, విప్‌గా ఉండి ఏం చేయలేని ఆయన ఇప్పుడు ఎమ్మెల్యేగా రీల్స్ చేసుకుంటూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. తాను గెలిచినా, ఓడినా ప్రజల మధ్యలో ఉంటానని ఇచ్చిన హామీ మేరకు అవకాశం ఉన్న ప్రతి చోట సహాయం అందజేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ప్రణవ్ పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేయలేని పనులైన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల సమయంలో లబ్ధిదారులు భావోద్వేగానికి లోనవుతుంటే, పదేళ్లలో ఇల్లిస్తామని మాయ మాటలు చెప్పి ఓట్లించుకున్న బీఆర్ఎస్ నాయకులు కనీసం కట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కూడా పంచలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల నాయకులు, గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాముల తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను (ఈవీఎంలను) జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సోమవారం తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆమె ఈ తనిఖీని అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లాకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చిన ఈవీఎంల భద్రతను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీ నుంచి శ్యామ్, ఏఐఎంఐఎం నుంచి ఫైజొద్దీన్, బీజేపీ నుంచి హరిశంకర్, వైఎస్సార్‌సీపీ నుంచి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు అమూల్యం



◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, సుబేదారి:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర సమావేశానికి వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు జిల్లాల జిల్లా చైర్మన్లు, రాష్ట్ర పాలకవర్గ సభ్యుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. జిల్లా చైర్మన్లు, పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రక్తదానం సహా ఇతర మానవతా సేవల్లో రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న విశేష సేవలను కొనియాడారు. అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇచ్చే సహాయం అమూల్యమని పేర్కొన్నారు. అంతేకాకుండా, కీలక హామీలు ఇచ్చారు. రాష్ట్ర పాలకవర్గానికి చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారులు నియామకాలపై ముఖ్యమంత్రితో చర్చించి, తక్షణం గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటాను. జిల్లా చైర్మన్లు, పాలకమండలి సభ్యులను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాను. రాష్ట్రంలో అవసరమైన చోట్ల రెడ్ క్రాస్ సొసైటీలకు భూ కేటాయింపు, నూతన భవనాల నిర్మాణం వంటి అంశాల్లో ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి త్వరలో ముఖ్యమంత్రికి వివరించనున్నట్లు తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నెలసరి ఆర్థిక సహాయ పథకం అమలు జరిగేందుకు ప్రభుత్వం దృష్టికి తప్పక తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ సేవలు మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమావేశం ముగింపులో, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ.శ్రీనివాస్ రావు, తోట రాజశేఖర్, కె.ప్రసాద్ రావు, జనార్దన్ రావు, మహేందర్ రెడ్డి సహా వివిధ జిల్లాల చైర్మన్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**వరంగల్ వాయిస్, మల్హర్ (భూపాలపల్లి):** జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, సంబంధిత విభాగాల సిబ్బంది ఎలాంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పౌర సరఫరాలు, సహకార, డీఆర్‌డీఏ, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నందున, రైతుల నుండి వరి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వరి రాబడి గరిష్ట స్థాయికి చేరుతున్న ఈ సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ, ఆలస్యం జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలి. రైతులు కేంద్రాలకు తెస్తున్న వరిలో తేమ శాతం ప్రతిరోజు పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీలు, తూకాలు, రిజిస్టర్లు సహా ఇతర సామగ్రి సిద్ధంగా ఉండాలి. కొనుగోలు జరిగిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, అలా



చేస్తే 24 గంటల్లో రైతులకు డబ్బులు జమ చేయబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్యాబ్ ఎంట్రీలో జాప్యం చేయొద్దని హెచ్చరించారు. పీక్ సీజన్ సమయంలో ప్రత్యేక నిఘా బృందాలు ఫీల్డ్‌లో నిరంతరం పర్యటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, వ్యవసాయ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీధర్ జన్మదిన వేడుకలు


**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ఈఈయూ) 327 స్టేట్ సెక్రటరీ జనరల్ శ్రీధర్ జన్మదిన వేడుకలు సోమవారం హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లోని యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు యూనియన్‌కు చెందిన రాష్ట్ర, కంపెనీ, రీజియన్, డివిజన్ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీధర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు శ్రీధర్ సేవలను కొనియాడారు. శ్రీధర్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతారని, ఉద్యోగుల సంక్షేమమే తన ధ్యేయమని తెలిపారు. ఆయన నాయకత్వంలో యూనియన్ మరింత బలోపేతమైందని ప్రశంసించారు. హక్కుల పోరాట సమయాల్లో విద్యుత్ కార్మికుల హక్కుల కోసం ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేక్ కటింగ్ కార్యక్రమం అనంతరం, యూనియన్ నాయకులు శ్రీధర్ కి శాలువాతో సత్కారం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ “ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమ చర్యలు, సంస్థ అభివృద్ధి—ఇవే నా లక్ష్యాలు. మీరందరూ



చూపిస్తున్న ప్రేమ, నమ్మకం నా బాధ్యతను మరింత పెంచుతున్నాయి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కంపెనీ సెక్రటరీ శ్రీనివాస్, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, ట్రెజరర్ కట్ల సదయ్య, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలము ఐలేష్, స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్లు పి.రమేష్, సీహెచ్.నరేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతితో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అఖండ–2 కు తొలగిన అడ్డంకులు..

12న విడుదలకు మార్గం సుగమం: తమ్మారెడ్డి వ్యాఖ్య బాలకృష్ణ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తోన్న చిత్రం 'అఖండ 2' ఆర్థిక వ్యవహారల కారణంగా వల్ల చివరి నిమిషంలో వాయిదా పడిరది. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ సినిమా ఇష్యూ క్లియర్ అయిందని టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. డిసెంబర్ 12న 'అఖండ 2' విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరంలో 'హరిహరవీరమల్లు', 'అఖండ 2' విడుదల విషయంలో ఇబ్బందులు వచ్చాయి. నిర్మాతలకు గతంలో ఉన్న ఆర్థికపరమైన కమిట్‌మెంట్‌ల కారణంగా ఇవి తలెత్తాయి. నా అంచనా ప్రకారం డిసెంబర్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. అందరూ దీనికోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తారు' అని అన్నారు. డిసెంబర్ 12న ఈ సినిమా విడుదల కానున్నట్లు వార్తలు జోరందుకోవడంతో.. పలు ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఓవర్సీస్‌లోనూ 'అఖండ 2' విడుదల కానున్న విషయం తెలిసిందే. తాజాగా ఆస్ట్రేలియాలో ఈ సినిమా బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. దీంతో మేకర్స్ ఈ తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు అభిమానులు భావిస్తున్నారు.





## 20 నిమిషాల పాటు వెంకీతో..

**దర్శకుడు అనిల్ రావిపూడి**

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు. 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. వెంకటేశ్ కామియో రోల్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీలో వెంకీ, చిరు పాటకు సంబంధించిన వార్తతో సినిమాపై అంచనాలు పెరిగిపోతున్నాయి. ఈ చిత్రంలో వెంకటేశ్ ఎంతసేపు కనిపించబోతున్నాడనే దానిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు అనిల్ రావిపూడి. వెంకటేశ్ ఇందులో సుమారు 20 నిమిషాలు కనిపిస్తాడని చెప్పాడు. అంతేకాదు క్లైమాక్స్‌లో చిరంజీవి, వెంకటేశ్ మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతాయని క్లారిటీ ఇచ్చేశాడు. ఈ కామెంట్స్‌తో మూవీ లవర్స్‌కు ఫుల్ మీల్స్ వినోదాన్ని గ్యారంటీ అని చెప్పకనే చెబుతున్నాడు అనిల్ రావిపూడి. ఇప్పటికే మన శంకర వర ప్రసాద్ గారు నుంచి రిలీజ్ చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతుండగా.. శశిరేఖ సాంగ్ కూడా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. ఈ చిత్రంలో వీటీవీ గణెళిశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్దన్, రేవంత్ భీమల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వెంకటేశ్ ఎక్స్‌టెండెడ్ క్యామియో పాత్ర మరింత హైలైట్ కానుందని తాజాగా దర్శకుడు అనిల్ రావిపూడి వెల్లడిరచారు. ఓ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన అనిల్ రావిపూడి, వెంకటేష్ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని, కేవలం గెస్ట్ అప్పియరెన్స్ మాత్రమే కాకుండా 20 నిమిషాలపాటు ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ చేస్తాడని స్పష్టంచేశారు.ఇటీవల వెంకటేష్ ఒక పాట షూట్ కూడా పూర్తి చేశారు. వెంకీ ఎంట్రీతో సినిమా హాస్యభరిత వాతావరణం మరింత పెరిగేలా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు స్టార్లు కలిసి కనిపించడం చాలా అరుదుగా జరిగే విషయం కావడంతో, ఈ కాంబినేషన్ స్క్రీన్‌పై సూపర్ ఎనర్జీ క్రియేట్ చేయనుంది. చాలా రోజుల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి కామెడీ సినిమాతో వస్తున్నందుకు చిరంజీవి కూడా ఉత్సాహంగా కనిపిస్తున్నారు.చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల, సాహు గారపాటి సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## మీరు ఊహించని మరో చీకటి ప్రపంచం

**మరో హర్రర్ మూవీ ఈషా ట్రైలర్ విడుదల**

ఇటీవలే లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించారు బన్నీవాస్, వంశీ నందిపాటి. ఈ కాంబో తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుంది. రాజు వెడ్స్ రాంబాయి ఫేం అఖిల్‌రాజ్‌తోపాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ మూవీలో హెబ్బాపటేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్నిడిసెంబర్ 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించిన ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌ను గమనిస్తే.. ఇప్పటి వరకు వచ్చిన రెగ్యులర్ హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఇదొక ఆసక్తికరమైన పాయింట్‌తో అల్లుకున్న భయపెట్టే కథ అనిపిస్తుంది. సినిమా రెగ్యులర్ హారర్ ఫార్ములాకు భిన్నంగా ఉండేలా కనిపిస్తుంది. మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది అని ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ప్రేక్షకులు ఉలిక్కిపడే ట్విస్ట్‌లు పుష్కలంగా ఉన్నాయని పిస్తుంది. దెయ్యాలు, ఆత్మలు లేవని బలంగా నమ్మే స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎక్స్ పోజ్ చేయడానికి బయలుదేరిన వీరికి, బాబ్లూ పృథ్వీరాజ్ రూపంలో ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్ తో వీరు ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడతారు. సైన్స్‌కు, అతీంద్రియ శక్తులకు మధ్య జరిగే క్లాష్ దీన్ని ఆసక్తికరంగా మలిచారు. ట్రైలర్‌లోని విజువల్స్ చాలా వరకు బ్లూ అండ్ డార్క్ థీమ్‌లో సాగాయి. ముఖ్యంగా ఆ పాడుబడిన బంగ్లా, అక్కడ నేల మీద వేసి ఉన్న యంత్రాలు, క్షుద్ర పూజల సెటప్ సినిమాలోని మూడ్ ని ఎలివేట్ చేశాయి. కెమెరామెన్ సంతోష్ లైటింగ్ వాడిన విధానం, దానికి ఆర్‌ఆర్ ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తోడై కొన్ని చోట్ల ఉలిక్కిపడేలా చేశాయి. డిసెంబర్ 12న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ చివరలో వచ్చే ట్విస్ట్ లు, ఫాస్ట్ కట్స్ సినిమా మీద ఒక క్యూరియాసిటీని అయితే క్రియేట్ చేశాయి.



## భర్త మహాశయులకు విజ్ఞప్తి నుంచి మరో పాట

టాలీవుడ్ యాక్టర్ రవితేజ ప్రస్తుతం కిశోర్ తిరుమల దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే నయా టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, ఖిలాడి ఫేం డిరపుల్ హయతి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ సాంగ్ విడుదల చేయగా మ్యూజిక్ లవర్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా సెకండ్ సింగిల్ అద్దం ముందు అప్‌డేట్ అందించారు. రవితేజ, డిరపుల్ హయతి కాంబోలో రానున్న ఈ సాంగ్ ప్రోమోను డిసెంబర్ 10న సాయంత్రం 6:03 గంటలకు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. రవితేజ, డిరపుల్ హయతి సూపర్ కూల్ ట్రాక్‌తో సాంగ్ విజువల్స్ ఉండబోతున్నట్టు తాజా లుక్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుండగా.. విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ పక్కా ఫ్యామిలీ టచ్‌తో రవితేజ సినిమా ఉండబోతున్నట్టు గ్లింప్స్ హింట్ ఇచ్చేస్తుంది. టైటిల్ గ్లింప్స్‌లో భక్త మహాశయులకు విజ్ఞప్తి.. ఇవాళ 10 : 30 నిమిషాలకు స్వామి వారి కళ్యాణం. అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందంటూ.. పంతులు వాయిస్ ఓవర్‌తో సాగే మాటలతో షురూ అయింది గ్లింప్స్. అనంతరం ఈ అనౌన్స్‌మెంట్ మనలో చాలా మంది చాలా సార్లు వినుంటాం. ఇప్పుడు నాకిది ఎందుకు గుర్తొచ్చిందంటే నా జీవితంలో ఉన్న ఇద్దరు ఆడవాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, జెమినీ, చాట్ జీపీటీ ఇలా అన్నింటిని అడిగాను. వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా అయోమయానికి గురిచేశాయి అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో సాగుతున్న వీడియో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.



# డ్రైన్‌ల తర్వాతే రహదారి నిర్మాణాలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రహదారులకు ఇరు వైపుల మురుగు కాలువల నిర్మాణం తర్వాతే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో గ్రీవెన్స్ ముగిసిన అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 27 వ డివిజన్ లో వేసిన రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేస్తున్నారని ఇలా చేయడం సరికాదన్నారు. రోడ్డును విస్తరించి, డ్రైన్ ను నిర్మించి, ఆక్రమణలను తొలగించి రోడ్డు వేస్తున్నామని, అవసరం లేని ప్రాంతాల్లో రోడ్డును వేయవద్దని రోడ్డు ఉండగా రోడ్డు వేయాలని ప్రపోజల్ వస్తే అట్టి అంశాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. అవసరం మేరకే పనులను చేపట్టాలన్నారు. రూ.30 కోట్ల వరకు బడ్జెట్ లో అవకాశం ఉందని, రూ.450 కోట్లకు అనుమతులు ఇచ్చామని 10 సంవత్సరాల తర్వాత కూడా ప్రభుత్వం అట్టి పనుల తీరును సమీక్షించే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు వేసే ముందు డ్రైన్ నిర్మించేలా చూడాలని దీని వల్ల ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కొత్త ప్రాంతాల్లో రోడ్డు వేయాల్సిన పరిస్థితి వస్తే ముందుగా డ్రైన్ నిర్మించాలని దీనివల్ల మార్జిన్ లు సెట్ అవుతాయని టెండర్ అగ్రిమెంట్ లు పూర్తయినా అక్కడ రోడ్డు అవసరం లేదు అనిపిస్తే పనులు మొదలు పెట్టకూడదన్నారు. ఇటీవల కౌన్సిల్ లో సుమారు రూ.100–120 కోట్ల పనులకు టెండర్ పిలవాలని నిర్ణయించడం జరిగిందని అవసరం మేరకే టెండర్ లు పిలవాలని అవసరం లేకపోతే నిలిపివేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్ కు సంబంధించి హియరింగ్ లు ముగిసాయని ఎందుకు ఆర్డర్లు ఇవ్వలేదని గత వారం ముగిసిన హియరింగ్ లకు కూడా ఇప్పటివరకు ఆర్డర్లు ఇవ్వలేదని వెంటనే అందజేయాలని కమిషనర్ సిటీ ప్లానర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ ఈఈలు సంతోష్ బాబు, మహేందర్, మాధవి లత, ఏసీపీలు ఖలీల్, ప్రశాంత్, రజిత, ఎర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 96 ఫిర్యాదులు..

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 45, ఇంజనీరింగ్ కు 28, రెవెన్యూకు ఏడు, హెల్త్, శానిటేషన్ కు 12, నీటి సరఫరాకు మూడు, హార్టికల్చర్ కు ఒకటి మొత్తం 96 ఫిర్యాదులు వచ్చినట్లు అదికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఓ రమేష్, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రవీందర్, సమ్మయ్య, టీఓ రామకృష్ణ, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూర్తయిన ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల పరిశీలకురాలు బాలమాయాదేవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది కేటాయింపులో మొదటి విడత 3వ ర్యాండమైజేషన్, రెండవ విడత 2వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమక్షంలో సోమవారం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నియమావళి అనుసరించి ఎన్నికల పీఓ, ఓపీఓల ర్యాండమైజేషన్ జరిగింది. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సునయన చౌహాన్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని మొదటి విడతలో పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, రెండో విడతలో గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం మండలాల వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, పీఓ, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని మొదటి విడతలో గల 85 గ్రామ పంచాయతీలు, 731 వార్డు స్థానాలకు, రెండో విడతలో 114 గ్రామ పంచాయతీలు, 984 వార్డులకు గాను ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, పీఓ, ఓపీఓల ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఇందులో మొదటి విడతలో 1975 లో పీఓ 877, ఏపీఓలు 1098 పోలింగ్ సిబ్బందిని, రెండో విడతలో 2,568 లో పీఓ 1,181లు, ఏపీఓలుగా 1,387 పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులతో సమీక్ష..

జిల్లాలో ప్రస్తుత యాసంగి 2025–26 పంటకాలానికి సంబంధించి పంటల సరళి విత్తనాల లభ్యత, ఎరువుల లభ్యత, అమ్మకాలపై కలెక్టర్ సమీక్షించారు. మొక్కజొన్న పంట 26,510 ఎకరాలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు 6,877 ఎకరాలలో మరియు వరి నారుమల్లు 11,500 ఎకరాలలో సాగులో ఉన్న యాసంగి పంటకాలానికి సంబంధించి అన్ని రకాల విత్తనాలు అందుబాటులో కలవని, యాసంగి పంటకాలంలో వరి 1,15,200 ఎకరాలలో సాగు అంచనా మరియు అందుకు అవసరమైన వరి విత్తనాలు 23,040 క్వింటాళ్ళు, మొక్కజొన్న 1,08,500 ఎకరాలలో సాగు అంచనా మరియు అందుకు అవసరమైన 8680 క్వింటాళ్ళ విత్తనాలు అందుబాటులో కలవని అన్నారు. యాసంగి పంట కాలానికి సంబంధించి అక్టోబర్ 2025 నుండి ఇప్పటివరకు 12,719 మెట్రిక్ టన్నుల యూరియా వరంగల్ జిల్లాకు సరఫరా చేయడం జరిగినదని, ఇందులో మార్కెఫెడ్ ద్వారా 4240 మెట్రిక్ టన్నుల, ప్రైవేటు డీలర్ల ద్వారా 4819 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయడం జరిగినది. ప్రస్తుతం మార్క్ఫెడ్ వద్ద 3660 మెట్రిక్ టన్నులు సొసైటీల వద్ద 498 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డివిజన్ల వద్ద 266 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలవని తెలిపారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. రైతులకు కావలసిన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని, కల్తీ విత్తనాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, యూరియా నిల్వలు ప్రతి మండలంలో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రాపవుట్‌లు తగ్గించాలి..



- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించాలి
- పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశాభివృద్ధికి అసలైన పునాది విద్యారంగమే అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. విద్యారంగాన్ని బలపరిస్తేనే దేశం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. వరంగల్ జిల్లాలో పాఠశాలల అభివృద్ధి, డ్రాపవుట్ ల తగ్గింపు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రోత్సాహకాలపై కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టాలని కడియం కావ్య కోరారు. అయితే, 2023–24లో వరంగల్ జిల్లాలో సెకండరీ స్థాయిలో 22.45 శాతం మంది విద్యార్థులు చదువు మధ్యలోనే మానేయడం తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నదని ఎంపీ డాక్టర్ కావ్య పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, పాఠశాలల అప్ గ్రేడేషన్, ఉన్నత విద్య, సౌకర్యాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉపకార వేతనాలపై కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభలో సమాధానం ఇచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూసా పథకం కింద రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో పరిశోధన కేంద్రాలు, ఇన్నోవేషన్ ప్రాజెక్టులు, యువతకు మార్గదర్శకంగా నిలిచే ఎంట్రప్రెన్యూర్‌షిప్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 'పీఎం–ఉషా' పథకం కింద రూ.56 కోట్లను కాకతీయ విశ్వవిద్యాలయం, హనుమకొండలోని కాకతీయ పురుషుల డిగ్రీ కళాశాల, వడ్డేపల్లిలోని పింగళి మహిళా డిగ్రీ కళాశాలకు కేటాయించినట్లు తెలిపారు.



# షెల్టర్ కిట్స్ పంపిణీ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** నగరంలోని 27 డివిజన్ కొండ పటేల్ కాలనీలో వర్షంతో దెబ్బతిన్న 70 కుటుంబాలకు బాల వికాస ఆధ్వర్యంలో అమెజాన్ సహకారంతో షెల్టర్ కిట్లు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ మాట్లాడుతూ కొండా దంపతుల సహకారంతో వారి నాయకత్వంలో కొండ పటేల్ కాలనీలో వర్షంతో దెబ్బతిన్న కుటుంబాలకు షెల్టర్ కిట్స్ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ఐటీ మేనేజర్ మైలవరపు శివరాం, కొండ పటేల్ కాలనీ అధ్యక్షులు దౌడు నాగరాజ్, కమిటీ సభ్యులు శ్యామల మార్క్, ఓడపల్లి రవి, ఎలగొండ శ్రీనివాస్, షేక్ సలీం, పొడిశెట్టి సరళ దేవి, రామగిరి శ్రీవిద్య, కొండపర్తి శ్రీలత, దామర కొండ విజయలక్ష్మి, ఎస్ కే రబ్బాని, నజియా, కొండ పటేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజమే లక్ష్యం

☐ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** అవినీతి రహిత సమాజ నిర్మాణమే మన అందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని సీపీ జెండా ఊపి ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోక జంక్షన్ వరకు సాగింది. ఈ అవగాహన ర్యాలీలో విద్యార్థులతో పాటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,ఏసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడం ద్వారానే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. భవిష్యత్తులో అవినీతి నిర్మూలనలో విద్యార్థి, యువత పాత్ర చాలా కీలకమన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్ స్పెక్టర్ రాజు, ఇతర ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com